నేటి తరానికి పాపన్న పోరాటం స్ఫూర్తి

- వి.హనుమంతరావు, కేపీ.మురళీకృష్ణ
- సర్దార్ సర్వాయి విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళి
- పాల్గొన్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మాజీ ఎంపీ వీహెచ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నేటి తరానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాటం స్ఫూర్తి అని, ఆయన విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ.మురళీకృష్ణ అన్నారు. పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. బహుజన రాజ్యసాధన కోసం సర్వాయి పాపన్న ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బహుజన రాజ్యస్థాపన కోసం పోరాడిన యుద్ధ వీరుడు పాపన్న అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని రాజ్యసాధన కోసం బీసీలందరూ ఏకం కావాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. పాపన్న ఆశయాల సాధన కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. తెలంగాణ బలహీన వర్గాల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని, అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీ, వివిధ ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు.



ఫీవర్ ఆస్పత్రిచౌరస్తాలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత కేపీ.మురళీకృష్ణ తదితరులు

నల్లకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానించి, ఆర్డినెన్స్ జారీచేయడం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ.మురళీకృష్ణ అన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని అన్నారు. నల్లకుంట డివిజన్ ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం నాయకులు టి.లాలయ్యగౌడ్, వెంకట్‌గౌడ్, సతీష్‌చంద్రగౌడ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాపన్న ఆశయాల సాధనకు కృషి : వీహెచ్



అంబర్‌పేటలో పాపన్న జయంతి వేడుకల్లో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, గౌడ సంఘం నేతలు

రాంనగర్: సర్దార్ పాపన్న ఆశయాల సాధన కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం అంబర్‌పేట గౌడ సంఘం చైర్మన్ రవీందర్‌గౌడ్, అధ్యక్షుడు పి.గిరిధర్ గౌడ్, ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం కార్యాలయంలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారని అన్నారు.

బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక



టీడీపీ నగర కార్యాలయంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాయిబాబా, బాల్‌రాజ్‌గౌడ్, కిషోర్ తదితరులు

రాంనగర్: తెలంగాణ బలహీన వర్గాల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో చిత్రపటానికి ఆయన పూలమాలలేసి నివాళులర్పించి మాట్లాడారు. జనగామ జిల్లాకు పాపన్న పెట్టాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించాలన్నారు.

బహుజన రాజ్యస్థాపన యుద్ధ వీరుడు



చిక్కడపల్లిలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

రాంనగర్: సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకుని రాజ్యసాధన కోసం బీసీలందరూ ఏకం కావాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం చిక్కడపల్లిలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అధ్యక్షతన పాపన్న గౌడ్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహానికి ప్రభుత్వం భూమి పూజచేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు, డాక్టర్ విశారదన్ మహారాజ్, యెలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్, కోతి కిషోర్‌గౌడ్, ఎంవీ.రమణ, విజయకుమార్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నాగేష్, పి.బడేసాబ్ పాల్గొన్నారు.

పాపన్న జీవితం నేటి తరానికి మార్గదర్శకం : మాజీ ఎంపీ



పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

బర్కత్‌పుర: సామాజిక సమానత్వ పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవితం నేటి తరానికి మార్గదర్శకం అని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ నిర్మాణంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గంగానగర్‌లో పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు బొమ్మ రాజు ఈశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, నాయకులు పాల్గొన్నారు. - గోల్నాక



పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



కవాడిగూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కవాడిగూడ: బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గీతాకార్మిక సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శంకర్, కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు సానెం హరీష్‌గౌడ్ సూచించారు. కవాడిగూడ గౌడ సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు మొరిగడి నవీన్‌గౌడ్, బి.కృష్ణ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్‌లో ఆయన విగ్రహం ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజచేయడం అభినందనీయమని అన్నారు.

బహుజన రాజ్యాధికార సాధన యోధుడు



సర్దార్ సర్వాయిపాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, ముత్యం బాలరాజు గౌడ్ తదితరులు

ముషీరాబాద్: బహుజన రాజ్యాధికార సాధన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు బి.లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. రాంనగర్‌లో గౌడసంఘం సీనియర్ నాయకుడు ముత్యం బాలరాజుగౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పలువురి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువత దేశం కోసం పాటుపడాలి



సర్వాయి పాపన్న, సుభాష్‌చంద్రబోస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దత్తాత్రేయ

రాంనగర్: దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడైన నేతాజీ సుభా ష్‌చంద్రబోస్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశం కోసం పాటుపడాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. సోమవారం రాంనగర్‌లోని తన నివాసంలో సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యసాధన కోసం సర్వార్ పాపన్న ఎన్నో పోరాటాలు చేశారని ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని దత్తాత్రేయ కోరారు. బీజేపీ నాయకులు ఓంప్రకాష్, శ్రీకాంత్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ముషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చేపల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గంగపుత్రులు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు రాంచందర్, హనుమంతు, పూస గోరక్‌నాథ్, కనుగుల రవి, ఆర్‌కే.ప్రసాద్, నర్సింగ్‌రావు, శ్రీరాములు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిమల్ల పార్వతికి పద్మచక్ర అవార్డు ప్రదానం

నల్లకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వల్లూరి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక సౌజన్యంతో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అండ్ ధర్మచక్ర అవార్డుల ప్రదానోత్సవం నగరంలోని రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతికి పద్మచక్ర- 2025 అవార్డును సినీనటుడు, మాజీమంత్రి బాబు మోహన్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ ప్రదానం చేసి సత్కరించారు.

ఐవీఎఫ్ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్

నల్లకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) న్యూఢిల్లీ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడిగా (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ నీలా శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం ఆయనను ప్రకటించారు. ఈ పదవి మూడు సంవత్సరాలు కొనసాగుతుంది. ఈ సందర్భంగా శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ తనకు పదవి కల్పించిన రాజమౌళిగుప్తా, శ్రీనివాస్‌గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు రాజకీయరంగంలో రాణించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు రాజకీయరంగంలో రాణించాలని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సంఘసేవకురాలు లలితకుమారిని ఆమె చేస్తున్న సామాజిక సేవలను ప్రశంసిస్తూ ఆమెను మధుసూదనాచారి చిక్కడపల్లిలో సన్మానించారు. రాజకీయాలతోపాటు ప్రజాసేవలో ఉన్నప్పుడే మహిళలకు సాధికారత సులభమవుతుందని ఆయన అన్నారు.

అనేకమందికి భూములు ఇచ్చిన వినోబాభావే

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భూదాన ఉద్యమంలో అనేకమందికి భూములను వినోబాభావే అందించారని వేంకటేశ్వరయూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గాంధేయవాది వినోబాభావే యాదిలో శీర్షికతో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య ఇనాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినోబాభావేను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, ఆయన సేవలను ప్రపంచానికి తెలియజేయాలన్నారు. గాయకులు రామసుబ్రహ్మణ్యం, గానసభ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, జయసూర్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజానికి సేవలందించిన గంటెల ప్రకాష్

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొ.గంటెల ప్రకాష్ క్రైస్తవ సమాజానికి విలువైన సేవలు అందించారని తెలంగాణ క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న క్రైస్తవ థియోలాజికల్ స్పీకర్ బైబిల్ ప్రసంగీకులు ప్రొ.ప్రకాష్ గంటెల మృతి క్రైస్తవ సమాజానికి తీరనిలోటు అని అన్నారు. ప్రకాష్ గంటెల మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన దీపక్‌జాన్ మాట్లాడుతూ ఆయన క్రైస్తవ సమాజం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం జరిగిన అశ్రునివాళి ఊరేగింపులో క్రైస్తవసంఘం నేత జెరుషలేం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి అవార్డులు

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయగాన సభలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ప్రతిభాఅవార్డులు ప్రదానం కార్యక్రమం వేడుకగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరై, అవార్డులు బహూకరించిన బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత ఎం.నాగేశ్ముదిరాజ్ మాట్లాడుతూ పురస్కారాలు, అవార్డులు ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం రాష్ట్రనేత కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, సమాజసేవకులు వీఎన్.రావు, వీరభోగవసంతరాయలు, నాట్యగురువు వాణీరమణ, నిర్వాహకులు విక్కీమాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని శ్రీకృష్ణమందిరంలో మూడురోజులపాటు జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు సోమవారం ముగిశాయి. మందిరం నిర్వాహకులు డా.టి.గౌరీశంకర్ పర్యవేక్షణలో ప్రతినిత్యం ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 వరకు నిత్యార్చనలు, గోపూజ, సంగీత, నృత్య భజన, సంకీర్తనలు, వేదపారాయణం, ధార్మికప్రసంగాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ.రమణాచారి, కార్పొరేటర్లు రవిచారి, పావనివినయ్‌కుమార్ డా.కేవీ.కృష్ణకుమారి, చంద్రశేఖర్, గోపాలకృష్ణ, ప్రముఖకవి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గంగతెప్ప బోనాల మహోత్సవం

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గంగతెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గంగతెప్ప బోనాలు మహోత్సవాన్ని నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ జి.అరుణాజయేందర్‌బాబు తదితరులు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు గుండు జగదీశ్‌బాబు, ప్రధానకార్యదర్శి పూస నరసింహ, నాయకులు మంగపల్లి రాజు, వైరు బాబురావు, కాపరనేని లింగం, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రభాకర్



రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ముచ్చుకూర్తి ప్రభాకర్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, మున్నూరుకాపుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రాజ్యాంగ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ ఫలాలను షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ షెడ్యూల్డ్ కులాల జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ సూచించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాజ్యాంగం-షెడ్యూల్డ్ కులాల హక్కులు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జి.వెంకటస్వామి షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజ వివేక్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలి: డీబీఎఫ్

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలని దళిత బహుజనఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు చెల్లించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధించిన షరతులు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

24న కాపు, బలిజ, తెలగ, మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న త్యాగరాయ గానసభలో కాపు, బలిజ, తెలగ, మున్నూరుకాపు సామాజికవర్గాల వారి కోసం వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు వేదిక స్థాపకుడు ఎ.కోటేశ్వరరావు పేర్కొన్నారు. మధ్యవర్తులు, కమీషన్ వంటి వాటికి దూరంగా ముఖాముఖిగా మాట్లాడుకుని సంబంధాలు కుదుర్చుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ వేదికలో పాల్గొనదలచినవారు మ్యాక్సీ సైజ్‌ఫోటోతో దరఖాస్తుఫారంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. దూరప్రాంతాల్లో వారు వేదికకు రాలేని వారు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 22లోగా 9398314847 నెంబర్‌లో సంప్రదించాలని లేదా కార్యక్రమం రోజు ముందుగా రావాలని కోరారు.

సర్వీసు రోడ్డును పునరుద్ధరించండి

అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



క్యాంపుకార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఛేనెంబర్ నుంచి గోల్నాక వరకు ఒకవైపు సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో ప్రజలు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారని, ఈ సమస్య పరిష్కారానికి సర్వీసు రోడ్డును పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం గోల్నాక తులసీనగర్‌కాలనీ లోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమావేశం నిర్వహించారు. సర్వీసు రోడ్డు విషయమై, గోల్నాకలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై సమీక్షించారు. అధికారులు సర్వీసు రోడ్డును పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకుంటేనే వివిధ మార్గాల్లోని ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ రోహిత్ ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.

టీఆర్‌టీ కాలనీలో కూలిన భారీ వృక్షం

బర్కత్‌పుర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని టీఆర్‌టీ కాలనీలో సోమవారం 5.30 గంటల సమయంలో భారీ వృక్షం కూలిపోయింది. దీంతో ఓ కారు, ఇంటి షెడ్ ధ్వంసమయ్యాయి. ఓ వృద్ధురాలికి గాయం అయ్యింది.పది రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డివిజన్‌లోని టీఆర్‌టీ కాలనీలో సుమారు 400 సంవత్సరాల భారీ వృక్షం కూలిపోయింది. ఓ షెడ్‌పై చెట్టు పడడంతో అందులో ఉన్న బాలమ్మ(85)కు గాయమైంది. పార్కు చేసిన కారు ధ్వంసమైంది. ఆ సమయంలో మరెవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ యాకర అమృత వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని వివిధ శాఖ అధికారులు, సిబ్బందిని రప్పించారు. ఈ మేరకు కాలనీలో రాకపోకలు నిలిచిపోవడంతో జీహెచ్ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) టీం భారీ వృక్షాన్ని కట్‌చేసి తరలించారు. అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, హార్టికల్చర్ అధికారులు, అంబర్‌పేట మండలం ఆర్ఐ పంచానామా నిర్వహించారు.

నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని ఆంధ్రమహావిద్యాలయం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో సోమవారం నులిపురుగల నివారణ మందులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, సీనియర్‌నాయకులు శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, శివకుమార్, సత్యేందర్, ఏఎన్ఎం భవాని, ఆశావర్కర్లు లక్ష్మి, సుచిత్ర, మాధవ్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

వారిని సన్మానిస్తే.. తెలంగాణను సన్మానించినట్లే



మధుసూదనాచారిని సత్కరిస్తున్న దత్తాత్రేయ

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధనతోపాటు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కృషిచేస్తున్న వారిని సన్మానించడం అంటే తెలంగాణను సన్మానించినట్లేనని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. దేశభక్తి అంటేనే స్ఫూర్తి వస్తుందని ఆయన అన్నారు. సోమవారం రాత్రి శ్రుతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారికి ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డును ఆయన ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, ప్రముఖులు రఫీ, వంశీరామరాజు, ఆనంద్, దైవజ్ఞశర్మ, కుసుమబోగరాజు, నవరసగాయని ఆమని, జితేందర్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కవాడిగూడ. ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాబోయే గణేశ్ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక అని, ఈ వేడుకలను మండప నిర్వాహకులు ప్రశాంత ంగా జరుపుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడలోని తాళ్లబస్తీలో ఏర్పాటు చేసే గణేశ్ మండపానికి కర్రపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, తాళ్లబస్తీ కమిటీ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బస్తీ కమిటీ నాయకులు వై.శ్రీనివాస్, అంజి, నాయకులు పాల్గొన్నారు.

పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి : ఏసీపీ

కవాడిగూడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గాంధీనగర్ డివిజన్ ఏసీపీ యాదగిరి పేర్కొన్నారు. సోమవారం రాత్రి గాంధీనగర్ పీఎస్ పరిధిలోని బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. ఇతరులకు ఇబ్బందులు కల్పించకుండా ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, పీస్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాల ఏర్పాటులో పోలీసు నిబంధనలు పాటించాలని ముషీరాబాద్ పీఎస్ సీఐ రాంబాబు సూచించారు. సోమవారం సాయంత్రం మహ్మదీయ ఫంక్షన్ హాల్‌లో గణేశ్ మండప నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాలను రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా, వాటి వద్ద ఇసుక, డ్రమ్ముల్లో వాటర్, ఫైర్‌సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ మహ్మద్ నదీమ్ హుస్సేన్, ఎస్ఐలు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్ఐ కమలాకరశర్మపై చర్యలు తీసుకోవాలి

- విచారణకు ఆటంకం కలిగిస్తున్న వ్యక్తిని కఠినంగా శిక్షించాలి
- ధన్వంతరి విక్టిమ్స్ ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ

నల్లకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్(డీఎఫ్ఐ)పేరిట రెండు దశాబ్దాలుగా వివిధ మోసాలకు పాల్పడిన కమలాకరశర్మపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విచారణకు ఆటంకం కలిగిస్తున్న వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ధన్వంతరి విక్టిమ్స్ ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ కోరారు. కమలాకరశర్మపై సీసీఎస్, అంబర్‌పేట, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కాగా ఆయన కోర్టు ఆదేశాలను దుర్వినియోగం చేస్తూ విచారణకు ఆటంకం కలిగిస్తున్నాడని ఆరోపించారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ బాధితులు డాక్టర్ మోహన్‌రావు, రామచంద్ర, ఎం.వి.శేషగిరిరావు, విజయలక్ష్మి, ఛాయాదేవి, సుబ్రహ్మణ్యం, సాయికుమార్, ఎన్.కృష్ణమూర్తి తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. నాడు ఈ సంస్థలో ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల పేర్లు చెప్పి మోసాలకు పాల్పడిన కమలాకరశర్మ అప్పట్లో ఉన్న ఏ అధికారి ఇప్పుడు ఈ సంస్థలో లేరని ఆయన స్పష్టంచేశారు. పదేళ్లుగా సీసీఎస్‌లో వైట్ కాలర్ 19 కేసులు పెండింగ్‌లో ఉండడం శోచనీయమన్నారు. ఈ కార్యాలయాన్ని సీసీఎస్ సీజ్‌చేసినప్పటికీ సదరు వ్యక్తి ఓపెన్ చేసి బాధితులకు మెసేజ్‌లు పంపిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు.

కేసు సీసీఎస్ విచారణలో ఉన్నప్పటికీ కమలాకరశర్మ బాధితుల డబ్బులతో పలు ఆస్తులను కొనుగోలు చేయడం, సీజ్‌లో ఉన్న భూములను ప్రైవేట్ సర్వే చేస్తూ ఆర్థిక లావాదేవీలకు పాల్పడడం, ఒరిజినల్ డాక్యుమెంట్‌లు ఇస్తామని బాధితుల నుంచి డబ్బులు కలెక్ట్ చేయడం, బెయిల్ కండిషన్‌ను కచ్చితంగా పాటించకపోవడంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. సదరు వ్యక్తి బాధితులకు సెటిల్‌మెంట్ పేరిట జరుగుతున్న భూవ్యాపారాలు, ఒప్పందాలను వెంటనే ఆపేయాలన్నారు. ఈ కేసుకు ప్రత్యేకంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమిచాంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బాధితుల డబ్బులు కచ్చితంగా వడ్డీతో సహా తిరిగిచెల్లించాలని, కమలాకరశర్మ సీసీఎస్‌కు చెప్పకుండా ఉంచుకున్న ఆస్తులను కూడా జప్తుచేసి ప్రభుత్వ వేలం జాబితాలో చేర్చాలని కోరారు. కేసుపై ఈనెల 26న కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కమలాకర్‌శర్మను ఏ మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.